క్లుప్తంగా

పౌష్టికాహారంతో గర్భిణులకు మేలు



గర్భిణులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

మద్దిపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం అందిపుచ్చుకోవాలని ఐసీడీఎస్ మద్దిపాలెం ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ జేటీఎన్ జ్యోతి సూచించారు. ఈ మేరకు 51వ వార్డు గాంధీనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సోమవారం శీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుని గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి, వారి సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, మహిళా పోలీస్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 20 అర్జీలు

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 20 మంది అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

సీతంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో 'నేత్రదానం -ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నేత్ర వైద్యశాఖ సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు 9, 10 తరగతి విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. అనంతరం కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ నరస, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, భవిత టీచర్ జగదాంబ, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, టెక్నీషియన్ హుస్సేన్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌తో సమస్యల పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సమన్వయకర్త కేకే రాజు

సీతమ్మధార: నియోజకవర్గంలో సమస్యల పరిష్కార దిశగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తెలిపారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రిలే అవుట్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి పలువురు తమ సమస్యలపై విన్నవించుకున్నారు. వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించి, అధికారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు. మరికొన్ని దరఖాస్తులు సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఉందన్నారు. ఆసక్తి గల అర్హత అభ్యర్థులు kvic onine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

క్రీడల్లో అదుర్స్



రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం లక్ష్మీ నరస, పీడీ సునంద్

- ఎన్జీజీవోస్ జీవీఎంసీ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభ అవార్డు
- ఆటల్లో జిల్లాలో మూడో స్థానం
- బాక్సింగ్, వాలీబాల్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ



బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన పి.సుబ్రహ్మణ్యం

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపుతున్నారు. పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు బాక్సింగ్, వాలీబాల్‌లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. దీంతో జిల్లాలోనే పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలవడంతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభ అవార్డుకు పాఠశాల ఎంపికైంది. విశాఖ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా జిల్లా స్థాయిలో క్రీడల్లో మూడో స్థానంలో నిలిచి, ప్రతిభ అవార్డుకు ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎంపిక కావడం విశేషం.

బాక్సింగ్, వాలీబాల్‌లో ప్రతిభ...

గత ఏడాది డిసెంబర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) రాజమండ్రిలో నిర్వహించిన పోటీల్లో బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో నాలుగు పతకాలు, నెల్లూరులో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రెండు పతకాలు పాఠశాల విద్యార్థులు సాధించారు. ఎజ్జీజీవోస్ జీవీఎంసీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి.సుబ్రహ్మణ్యం, పదో తరగతి విద్యార్థిని వి.ప్రవల్లిక, 9వ తరగతి విద్యార్థిని ఎం.ధనుశ్రీ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించారు. 9వ తరగతి విద్యార్థిని ఎన్.అనుష్క బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. 10వ తరగతి విద్యార్థినులు జి.ప్రవల్లిక, జి.సంజన వాలీబాల్‌లో రాష్ట్ర స్థాయిలో స్విలర్ మెడల్స్ సాధించారు. దీంతో 46 పాయింట్లు సాధించి జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను ఏపీ క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారు. మంగళవారం జరగనున్న జాతీయ క్రీడా దినోత్సవాల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారని హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.సునంద్ తెలిపారు.

ఆటలకు ప్రాధాన్యం



స్కూల్‌లో సుమారు 600 గజాల విస్తీర్ణంలో ఆట స్థలం ఉంది. అందులోనే వాలీబాల్, షటిల్, కబడ్డీ కోర్టులు తయారు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఏ ఆటలో ఆసక్తి చూపితే అందులో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. వారంలో 25 నుంచి 30 పీరియడ్స్ ఆటలకు, హెల్త్ ఎడ్యుకేషన్‌కు కేటాయిస్తున్నాం. చదువుతోపాటు మానసిక, శారీరర దారుఢ్యాన్నిచ్చే ఆటలకు ప్రాధాన్యమిస్తున్నాం. ఏటా సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ శిబిరాలు నిర్వహించి పిల్లలకు ఆటలపై ఆసక్తి పెంచుతున్నాం.

– ఎ.సునంద్, పీడీ, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

జిల్లాలో మూడో స్థానం



ఆటల్లో మా స్కూల్ జిల్లాలోనే మూడో స్థానంలో నిలిచింది. ఏపీ క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. స్కూల్‌లో ఉన్న కొద్దిపాటి గ్రౌండ్‌లోనే చాలా రకాల ఆటల్లో శిక్షణ ఇస్తున్నాం. వేసవి శిక్షణ శిబిరాల్లో పిల్లల ఆసక్తిని, ప్రతిభను గుర్తించి ఆయా ఆటల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నాం. గత ఏడాది ఎస్‌జీఎఫ్‌ఐ నిర్వహించిన పోటీల్లో మా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. మరిన్ని పతకాలు సాధించి వచ్చే ఏడాది మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తాం.

– లక్ష్మీ నరస, ప్రధానోపాధ్యాయురాలు, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

- వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు



మహిళకు కరపత్రం అందిస్తున్న కేకే రాజు తదితరులు

సీతంపేట: స్కూల్‌కు వెళ్లే పిల్లల దగ్గర నుంచి 60 ఏళ్లు దాటిన వృద్ధుల వరకు అందరికీ మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కొనియాడారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ – 2 సచివాలయం పరిధి ఎన్జీజీవోస్ కాలనీలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాండవ శ్రీను, రాయుడు శ్రీను, ఐ.రవికుమార్, 26వ వార్డు నాయకులు పోతు సత్యనారాయణ, అమ్మాజీ, శ్యామల, బాబ్‌జాన్, సుశీల, రమాదేవి, రోయ్, అనురాగ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



వుడా కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో కళింగనగర్, 48 లాస్ట్ బస్‌స్టాప్ వుడా కాలనీలో రోడ్డు పనులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. కళింగనగర్ ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. అలాగే 48 లాస్ట్ బస్‌స్టాప్ మాధవధార వుడా కాలనీలో బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సోమవారం ఆయా ప్రాంతాలను సందర్శించి పనులను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. గత 20 ఏళ్లుగా కళింగనగర్ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎక్టర్ శ్యామ్, రాజు, సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ అలేఖ్య, శ్యామ్, గణేష్, నాగేశ్వరరావు, ఏఆర్‌కే రాజు పాల్గొన్నారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్–మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్–డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధి రైల్వే క్వార్టర్స్ 11కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే క్వార్టర్స్, మద్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధి 11కేవీ ఫీడర్‌కు సంబంధించి స్ట్రింగింగ్ పనుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తెన్నేటినగర్, వర్మా కాంప్లెక్సు ఏరియా, మురళీనగర్, బాలభాను పాఠశాల, బర్మాకాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్, మసీదు ఏరియా, సింగరాయిమెట్ట, మంచుకొండ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణంపై ఫిర్యాదు



జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

సీతంపేట: ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఉత్తర నియోజకవర్గం సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణం, జిల్లా కౌన్సిల్ సభ్యులు పడాల గోవింద్ స్థానికులతో కలిసి స్పందన కార్యక్రమంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ రిలయన్స్ పెట్రోల్ బంకు వెనక సర్వే నంబరు 13లో దశాబ్దాలుగా రజకులు ఈ గెడ్డలో జీవీఎంసీ నిర్మించిన దోభీఘాట్‌లో తమ వృత్తిని కొనసాగిస్తున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. కొద్ది నెలల కిందట ఆ స్థలం తనదని, సర్వ హక్కులు ఉన్నాయని ఓ వ్యక్తి భవన నిర్మాణానికి ప్రయత్నించగా.. స్థానికుల ఫిర్యాదుతో అప్పటి రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ అధికారులు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలమని నిర్ధారించి భవనాన్ని కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ అదే వ్యక్తి ఆరు నెలల తర్వాత నిర్మాణ పనులు చేపడుతుంటే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు అడ్డుకోకుండా భూ కబ్జాదారులకు సహకరించడం దారుణమన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి భారీ భవన నిర్మాణం చేపడుతున్నట్టు పత్రికల్లో వస్తున్నా, గతంలో ప్రభుత్వ స్థలమని తహసీల్దార్ ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు.

35 మందికి కొత్త రేషన్ కార్డులు



రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులతో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో 35 మందికి కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పంపిణీ చేశారు. గణేష్‌నగర్ సచివాలయంలో లబ్ధిదారులకు సోమవారం ఈ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని కోరారు. గత ఆరు నెలల్లో దరఖాస్తు చేసిన వారితో పాటు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసిన 35 మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ ఆర్ఐ మురళి, సచివాలయం సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతోపాటే నైట్ అలవెన్స్‌లు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న సీహెచ్ సూర్యనారాయణ

మురళీనగర్: అమరావతి విశ్వసాహితి సమితి ఆధ్వర్యంలో మాధవధార భరద్వాజ క్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సంఘం కార్యదర్శి సీహెచ్.చిన సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకటరామమూర్తికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బాలబాట పత్రిక సంపాదకురాలు రమణమ్మను సత్కరించారు. కోశాధికారి పీఎల్‌వీ ప్రసాద్ పి.ప్రాన్సిస్‌ల ఆధ్వర్యంలో ఈ కవి సమ్మేళనం నిర్వహించారు.

గిడుగు పురస్కారానికి హైమావతి ఎంపిక

మురళీనగర్: స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఎ.హైమావతి తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు ఈ మేరకు ఆమెకు ఆహ్వానం పంపారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవాల్లో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటానికి 23 ఏళ్లు

- టీడీపీ హయాంలో కాల్పులు.. ముగ్గురి మృతి
- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అమరవీరుల సంస్మరణ సభ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్న వామపక్ష నాయకులు

సీతమ్మధార : టీడీపీ హయాంలో 2000, ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంపై పోలీసులు కాల్పులు జరిపి ముగ్గురిని బలితీసుకున్నారని సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష నాయకులు ధ్వజమెత్తారు. ఆ పోరాటానికి 23 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. విద్యుత్ పోరాటంలో అసువులుబాసిన అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ పెనుమల్లు మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చి పెద్ద ఎత్తున ప్రజలపై భారాలు వేసే సంస్కరణలు అమలు చేశారని ఆరోపించారు. అందులో భాగంగానే విద్యుత్ చార్జీలు పెంచారని గుర్తు చేశారు. ప్రజలు అనేక రూపాల్లో తమ నిరసన తెలియజేసినా చంద్రబాబు దిగిరాకపోవడంతో ఆగస్టు 28, 2000లో చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే ప్రజలు తండోప తండాలుగా వచ్చి పోరాటంలో పాల్గొన్నారని గురు చేశారు. ఈ పోరాటంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా పాల్గొనడంతో తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కరెంట్ చార్జీలు పెంచలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సంస్కరణలు రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం జిల్లా నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, ఎం.సుబ్బారావు, నాయుడు, చంద్రమౌళి, సీపీఐ నాయకులు రెహమాన్, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం

- ఆ విధంగా సిలబస్ రూపకల్పన అవసరం
- ఆధునిక సాంకేతికత విద్యార్థులకు చేరువ చేయాలి
- బీవోఎస్ సమావేశంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటిలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశపెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతో పాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలిచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం–2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఎస్.కె.భట్టి పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రికి సాయం

సీతమ్మధార : లయిన్స్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రికి స్పందన చేయూత ఫౌండేషన్ తరఫున 1.5 లక్షల చెక్కుని హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య లయిన్ వి.ఉమమహేశ్వరరావుకు అందజేశారు. విరాళం అంతా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో అందించినట్లు స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు తెలిపారు.

బుచ్చిరాజుకు హాస్పిటల్ ట్రస్టీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ మూర్తి పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు అందజేత

మురళీనగర్: మదర్ థెరిస్సా జయంతి వేడుకలు సందర్భంగా మురళీనగర్ మానవ సేవే మాధవ సేవ సభ్యులు సోమవారం సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. వీరు శ్రీనివాసనగర్ సమీపంలోని క్షమనసు౯౯ అనాథ బాలికల ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ మేరకు వారికి అవసరమైన నిత్యావసర సరకులు ఆశ్రమం నిర్వాహకురాలు పార్వతికి అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 ఎలక్టెడ్ గవర్నర్ రంగారావు, కో ఆర్డినేటర్ సీహెచ్ అప్పారావు, మానవ సేవే మాధవ సేవ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, కేవీఎస్ఎన్ ప్రసాద్, డి.వరప్రసాద్, ఉష, డి.కుమార్ వంశీ, ఎస్.సీతారామకృష్ణ, పి.సంతోష్ కుమార్, పి.సతీష్ కుమార్, కేవీ వర్మ, మాధురి, పి.వెంకటరావు, బి.వెంకటేశ్వరరావు, కె.భవాని శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవం

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

టిడ్కో ఇళ్ల సమస్యలపై జెడ్సీకి వినతి



జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందిస్తున్న కాలనీ ప్రజలు

కంచరపాలెం: టిడ్కో ఇళ్లలో విద్యుత్, తాగునీటి సదుపాయం, తదితర సమస్యలపై సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ సేవా సంఘం సభ్యులు జ్ఞానాపురం జోన్–5 కార్యాయలం వద్ద ధర్నా చేశారు. తాటిచెట్లపాలెం అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన ప్రజలు టిడ్కో ఇళ్ల సమస్యలపై జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం సభ్యులు పి.గౌరీ, ఎ.దుర్గాప్రసాద్, వి.కోటి, వి.బాబు, పి.పెద్దబాబు, పి.అప్పన్న, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.